## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ ఇన్‌చార్జ్ డీఈ బి.సామ్యా నాయక్ తెలిపారు. పద్మాక్షి కాలనీ, రాజ్‌పుత్ వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, అదాలత్ కూడలి, కోర్టు వెనుక ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ సమావేశం

హన్మకొండ: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు.

### ప్రత్యంగిర శరభేశ్వరుల కల్యాణం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ప్రత్యంగిర భైరవ సహిత శివశక్తి దేవాలయ ఆవరణలో ప్రత్యంగిర శరభేశ్వరుల కల్యాణ వేడుకలను గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మార్క సునీల్‌కుమార్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

### బిర్యానీ పాయింట్‌కు జరిమానా



వరంగల్ అర్బన్ / ఖిలా వరంగల్: వరంగల్ నగర పరిధి ఫోర్ట్‌రోడ్డులోని రెడ్ బకెట్ బిర్యానీ పాయింట్ యజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. బుధవారం తనిఖీలు నిర్వహించడంతో ఫ్రిడ్జ్‌లో నిల్వఉంచిన బిర్యానీని గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్, హెల్త్ అసిస్టెంట్ నరేష్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

### యశస్వి ఆస్పత్రి ప్రారంభం



నయీంనగర్: హనుమకొండ భీమారం రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన యశస్వి ఆస్పత్రిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యా నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ చైతన్య, పృథ్వీరాజ్ సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, అనిల్‌కుమార్, జక్కుల రజిత, కొంక హరిబాబు, మన్నె బాబురావు, గడ్డం వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### కిట్స్ లైబ్రేరియన్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాల కేంద్ర గ్రంథాలయంలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న ముచ్చుకుర్తి నిరంజన్‌కు ఏపీలోని కుప్పం ద్రావిడ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'అవైలబిలిటీ అండ్ యూజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ ఏ స్టడీ' అనే అంశంపై వర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఆంజనేయ పర్యవేక్షణలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని నిరంజన్ సమర్పించారు.

### కోటలో విద్యార్థుల సందడి



ఖిలా వరంగల్: మధ్యకోటను పలు పాఠశాలల విద్యార్థులు బుధవారం సందర్శించారు. దాంతో శిల్పాల ప్రాంగణం సందర్శకులతో కిటకిటలాడింది. నాలుగు కీర్తితోరణాల మధ్య ఉన్న అద్భుతమైన శిల్పకళా సంపద, ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలను వారు వీక్షించారు. అనంతరం ఏకశిల చిల్డ్రన్ పార్కులో సేద దీరారు. కాకతీయుల విశిష్టతను వారికి కోట గైడ్ రవియాదవ్ వివరించారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైటింగ్ షోను విద్యార్థులు వీక్షించారు.

### రాహుల్‌ను విమర్శిస్తే ఊరుకోం



హన్మకొండ చౌరస్తా: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హెచ్చరించారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల రాహుల్‌గాంధీ హనుమకొండ పర్యటన రద్దు కావడంతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు రాహుల్‌గాంధీ అని రామకృష్ణ కొనియాడారు. ఈ సమావేశంలో జగన్, అంకూస్, రాజు, శ్రీనివాసరెడ్డి, శ్రవణ్, అభి తదితరులు పాల్గొన్నారు.

# స్థలం దొరక్క తరలనున్న ఐటీఐ భవనాలు

- నూతన భవన నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు

కాజీపేట: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)కు నూతన భవనాల నిర్మాణాలకు సరైన స్థలం స్థానికంగా లభించకపోవడంతో హనుమకొండ ఐటీఐ ఆవరణలో భవనాలు కట్టించాలని అధికారులు నిశ్చయించడం చర్చనీయంశంగా మారింది. నూతన భవన నిర్మాణాల నిమిత్తం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.4.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇటీవల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటీఐలను బలోపేతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దాంతో ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా మార్చాలని అధికారులు నిశ్చయించారు. ఈక్రమంలో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

**అవసరమైన స్థలం లేకనే..**

కాజీపేటలో ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఐటీఐ ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలం లేకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. విద్యార్థుల శిక్షణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నూతన భవనాల నిర్మాణానికి దాదాపు 10 వేల చదరపు అడుగుల భూమి అవసరం ఉంది. డబ్బులున్నా సరైన స్థలం అందుబాటులో లేని కారణంగా అధికారులు ప్రత్యామ్నాయ స్థలం కోసం వేటాడుతున్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. రాంపురం ఇండస్ట్రీయల్, విద్యానగర్ బాలుర ఉన్నత పాఠశాల, సోమిడి ఊర చెరువు శివారు, బంధం చెరువు కింద ఖాళీగా ఉన్న స్థలాల్లో అనువైన స్థలం ఎంపిక చేయాలని చూస్తున్నప్పటికీ కేటాయించడానికి అనేక సాంకేతిక కారణాలు అడ్డంకిగా మారుతున్నట్లుగా చెబుతున్నారు.



కాజీపేట ఐటీఐ కళాశాల భవనం

**ప్రభుత్వ స్థలాలను విస్మరిస్తున్న అధికారులు**

కాజీపేటలో అనేక ప్రభుత్వ స్థలాలు కబ్జాలో ఉన్నవిపోను మిగిలిన స్థలాలపై అధికారులు దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఐటీఐకి అతి సమీపంలో ఉన్న కడిపికొండ శివారు 46, 55, 1002 వంటి సర్వే నంబర్లలో కావాల్సినంత స్థలం ఖాళీగా ఉందని పలువురు సూచిస్తున్నారు. కొంత మంది ఆయా స్థలాలను ఆక్రమించుకుని ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ప్రహరీలు నిర్మించుకుని వదిలేశారు. జిల్లా అధికార యంత్రాంగం కాస్త చొరవ తీసుకుని ఆ దిశగా పరిశీలన చేస్తే ఐటీఐకి సరిపోను స్థలం లభిస్తుందని చెబుతున్నారు.

**భూమి కేటాయించాలి**



ఐటీఐ నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలం కాజీపేట పట్టణంలోనే కేటాయించేలా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి. ప్రభుత్వ స్థలాలపై రెవెన్యూ అధికారులు, పట్టణ ప్రజలతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలి.

- దామెరుప్పల సతీష్, విద్యార్థి సంఘం బాధ్యుడు

**అనువైన స్థలం లేకనే..**



స్థానికంగా అనువైన స్థలం లభించని కారణంగానే అధికారులు హనుమకొండలో కొత్త భవనాలు కట్టించాలని భావిస్తున్నారు. ఎమ్మెల్యేతో కలిసి చాలా స్థలాలు పరిశీలన చేశాం.

- వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్, కాజీపేట ఐటీఐ

# డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ నాశనం

- సీపీ అంబర్ కిషోర్ ఝా

రామన్నపేట / వరంగల్: యువత డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు 2కే రన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా సీపీ అంబర్ కిషోర్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దేశాభివృద్ధికి తోడ్పడాల్సిన యువత.. మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగొని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎన్‌యూజే (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, యూనియన్ బాధ్యులు, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, తహసీల్దార్ ఇక్బాల్, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌లో పాల్గొన్న సీపీ, కమిషనర్, తదితరులు

### బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ రాంచందర్ నుంచి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

**యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా..**

కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ సురేష్‌లాల్ నుంచి హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్, సోషల్ సైన్స్ డీన్ మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

**మార్కెట్ కార్యదర్శిగా..**

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా ఇన్‌చార్జ్ బాధ్యతలను నర్సంపేట కార్యదర్శి జి.రెడ్డి స్వీకరించారు. మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న నిర్మల సస్పెన్షన్‌కు గురికావడంతో ఆమె స్థానంలో జి.రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

# ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఇంజారపు పూజ

- పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పూజ

హన్మకొండ: విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఐపీఎస్ అధికారి, పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పూజ ఇంజారపు సూచించారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో హడుప్సా ఆధ్వర్యంలో ప్రేరణ -2025 కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పూజ హాజరై మాట్లాడుతూ మంచి వ్యక్తులతో స్నేహం చేయాలని, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి మాట్లాడుతూ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ లా కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, హడుప్సా జిల్లా అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, కోశాధికారి డి.శంకర్, ప్రతినిధులు పి.వేణుమాధవ రావు, టి.బుచ్చిబాబు, టి.రాజేశ్వర్ రావు, ఎం.సంతోష్ రెడ్డి, వి.సి.రామారావు, పి.సతీష్ కుమార్, బి.వెంకట్ రెడ్డి, వై.వెంకటేశ్వర్ రావు, ఆర్.నవీన్ రెడ్డి, జి.పి.రాంచంద్రమూర్తి, వాసుదేవ రెడ్డి, సర్వరాజు అహ్మద్, ఆర్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి

- అడిషనల్ డీసీపీ రవి

వరంగల్ క్రైం: మానవ అక్రమ రవాణా నిర్మూలన, వెట్టి చాకిరీని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డీసీపీ రవి సూచించారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలనపై రూపొందించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాటి నిర్మూలనకు అందరితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవి, తదితరులు

కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, మేనేజర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ ఫలితాల్లో 'రెజోనెన్స్' సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న రాజిరెడ్డి, డైరెక్టర్లు

హన్మకొండ: జేఈఈ మెయిన్స్ -2025 ఫలితాల్లో హనుమకొండలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆ విద్యార్థులను హనుమకొండలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 8మంది విద్యార్థులు 99కి పైగా పర్సంటైల్, 54 మంది విద్యార్థులు 95కు పైగా పర్సంటైల్, 118 మంది విద్యార్థులు 90కి పైగా పర్సంటైల్ సాధించారని వివరించారు. ఈ విజయం వెనుక విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల అత్యుత్తమ బోధన సామర్థ్యం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్యరెడ్డి, అకడమిక్ డీన్ బీఎస్.గోపాల రావు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# సాహితీ రచనలో మేటి శోభారాణి

కేయూ క్యాంపస్: సమాజ పరివర్తనలో అంచెలంచెలుగా ఎదిగి, తన సాహితీ రచనలతో సామాజిక చైతన్యాన్ని మాజీ ప్రొఫెసర్ కందాళ శోభారాణి తీసుకొచ్చారని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ కొనియాడారు. కేయూ రెండో గేట్ సమీపంలో విజయగణపతి కాలనీలో శోభారాణి రెండోయాది సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం ఆమె ఎంతగానో కృషి చేశారని గుర్తుచేశారు. కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ శోభ ఆశయాల కోసం పనిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఈసం నారాయణ

సమావేశంలో అధ్యాపక జ్వాల సంపాదకులు గంగాధర్, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు గడ్డం కృష్ణ, అంజన్‌రావు, తిరుణహరి శేషు, వివిధ సంఘాల బాధ్యులు సోమ రాంమూర్తి, శ్రావణ్, శివ, స్టాలిన్, అరుణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### మెస్ ఓపెన్ చేయాలని ధర్నా

కేయూ క్యాంపస్: నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌లో మెస్ ఓపెన్ చేయాలని న్యూపీజీ హాస్టల్ విద్యార్థులు బుధవారం క్యాంపస్‌లో ధర్నా చేశారు. ఈమేరకు కామన్‌మెస్ గేట్ మూసేసి గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.

### ఉచిత పశు వైద్యశిబిరానికి స్పందన



ఖిలా వరంగల్: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో దత్తత గ్రామం మల్లకపల్లిలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్, స్థానిక పశు వైద్యురాలు డాక్టర్ ప్రియాంక హాజరై పశువులు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

### కేవీకేను సందర్శించిన నెక్కొండ విద్యార్థినులు

మామునూరు: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన పీఎం శ్రీస్కూల్ విద్యార్థినులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాజన్న, సౌమ్య, అరుణాజ్యోతి, రాజు, సాయికిరణ్, సాయిచంద్, శరత్ పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని, ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గత నెలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా ప్రోగ్రాంలో భాగంగా యూనివర్సిటీ క్రీడా మైదానంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు కేయూలోని సెనెట్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను వీసీ ప్రదానం చేశారు.

### కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఎం ఆధ్వర్యంలో కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య మాట్లాడుతూ 2015, 2024లలో జీఓ నంబర్ 58 ప్రకారం 200 మందికి ఇళ్ల పట్టాలిచ్చారని గుర్తుచేశారు. మిగతా వారికి కూడా పట్టాలివ్వాలని కోరారు.

### అనాథ బాలికకు అరుదైన శస్త్రచికిత్స

ఖిలా వరంగల్: వరంగల్ తిమ్మాపురంలోని న్యూలైఫ్ సొసైటీలో ఆశ్రయం పొందుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న 16 ఏళ్ల అనాథ బాలికకు మెడ భాగంలో కణతి ఏర్పడింది. కణతి క్రమేణా పెరుగుతోందని, చికిత్సకు ఖర్చు ఎక్కువవుతుందని వైద్యులు చెప్పారు. దాంతో ఆశ్రమ నిర్వాహకురాలు రజిని ఇటీవల తెలంగాణ వైద్య మండలి రాష్ట్ర సభ్యుడు డాక్టర్ వి.నరేష్‌కుమార్‌ను సంప్రదించారు. ఆయన స్పందించి శ్రీశ్రీనివాస సన్‌షైన్ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి, శస్త్ర చికిత్స ద్వారా విజయవంతంగా కణతి తొలగించారు.

### బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేడారపు సుధాకర్ డిమాండ్ చేశారు. కేయూలో బుధవారం నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్, పల్నాటి నరేష్, సాయి, అజయ్‌సింగ్, అరుణ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ కేయూ కన్వీనర్ బాలు డిమాండ్‌చేశారు. కాకతీయ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని అన్నారు. అనూష, గణేష్, యాదగిరి, హరికృష్ణ, రాజశేఖర్, రాజ్‌కుమార్, సాయి, నాగరాజు, చందన, మానస, శ్రీజ, చందన పాల్గొన్నారు.

### కేయూ దివ్యాంగ విద్యార్థుల కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్: కేయూ దివ్యాంగ విద్యార్థుల కమిటీని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్ఎం విభాగం అధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మన గోటిరాములు, జనరల్ సెక్రటరీగా సీహెచ్.గోపి, వైస్ ప్రెసిడెంట్‌గా బి.రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.స్రవంతిని ఎన్నుకున్నారు.

### డంపింగ్ యార్డును తొలగించండి



మడికొండ: 46వ డివిజన్ మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును అక్కడి తొలగించాలని ఆయా గ్రామస్తులు కోరారు. ఈమేరకు సుబేదారిలోని నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు అడ్‌హాక్ కమిటీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మద్దెల ఎర్రగట్టు స్వామి, తొటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, తాడూరి మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, పానగోటి వెంకట్‌రావు, దువ్వ నవీన్ పాల్గొన్నారు.

### ఎంఎస్ఆర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మడికొండ: 46వ డివిజన్ మడికొండ మెట్టురామన్న కాలనీ సమీపంలోని ఎంఎస్ఆర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు సంటి రవి అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సాంబయ్య మాట్లాడుతూ గత 20ఏళ్లుగా మెట్టు గుట్ట కింద ఉన్న స్థలంలో నివాసముంటున్న పేదలు.. కనీస సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### సంతకం.. ఆటోగ్రాఫ్‌గా మారాలి

హసన్‌పర్తి: విద్యార్థి సంతకం భవిష్యత్‌లో ఒక ఆటోగ్రాఫ్‌గా మారాలని సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఎల్లాపురం సమీపంలోని ఆర్బిట్ ఈ-టెక్నో పాఠశాలలో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సైకాలజిస్ట్ గూడెల్లి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి, డైరెక్టర్ హరికారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ వాసుదేవారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు లయన్స్ సేవామిత్ర క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రంరెడ్డి ఉపేందర్‌రెడ్డి, హెచ్ఎం టి.శ్రీనివాస్, లయన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్మన్ యర్రం రంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, మన బడి.. మన బాధ్యత నియోజకవర్గ పూర్వపు కోఆర్డినేటర్ దోమ కుమార్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన

కాజీపేట: ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కాజీపేట మేధా కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు. ఈమేరకు వారిని కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య బుధవారం అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ వాసంతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత బాలరాజు పిలుపునిచ్చారు. ఈమేరకు పడమరకోట అమరవీరుల స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. గంగుల దయాకర్, హరిబాబు, ఎండీ.ఖాన్, సుద్దాల వీరయ్య, ఇనుముల కృష్ణ, బాషపాక అశోక్, యాకయ్య, అక్బర్ పాల్గొన్నారు.

### మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను పునఃప్రారంభించినట్లు మెడికవర్ సెంటర్ హెడ్ నమ్రత తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ రీజినల్ హెడ్ పగడాల రవికుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న 2వ హెచ్‌ఎఫ్ఐ ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ వాల్‌పోస్టర్లను బాలసముద్రంలోని క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు నేషనల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు.

### ఓఎస్డీ పదవి నుంచి తొలగించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఓఎస్డీగా నియమితులైన గణిత విభాగం ప్రొఫెసర్ మల్లారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి బుధవారం విజ్ఞప్తి చేశారు. మంద నరేష్, బొట్ల మనోహర్, కలకోట్ల సుమన్, ఎల్తూరి సాయి, సాయి కొట్లర్, కుమ్మరి శ్రీనాథ్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

### ఆలయ కమిటీ పర్యవేక్షణలోనే ఉత్సవాలు

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర రంగనాథ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలోనే మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని హైకోర్టు అడ్వకేట్ జి.సతీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

### రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ సిగ్నల్ స్టార్టింగ్ పాయింట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి బుధవారం తెల్లవారుజామున రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు.

### జాతీయ రహదారులపై ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్

ఖిలా వరంగల్: రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రహదారులపై ఆర్టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. వరంగల్ – ములుగు జాతీయ రహదారిపై ఆర్టీఏ అధికారులు నిఘా వేశారు. ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న ఇసుక లారీలను గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.

# సంత్ సేవాలాల్ జయంతికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఉత్సవ కమిటీ సభ్యులు

హన్మకొండ: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. హనుమకొండ గిరిజన భవన్‌లో సేవాలాల్ జయంతి, భోగ్ బండారు కార్యక్రమాల ఏర్పాట్లను హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్, సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు జైసింగ్ రాథోడ్, పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్, చిన్నబాబు, నవీన్ నాయక్, ధారావత్ రామచంద్రనాయక్, ఉదయ్‌సింగ్ నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి అశోక కాలనీలోని గిరిజన భవన్ వరకు మహార్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న అర్చకులు

వరంగల్ అర్బన్ / హన్మకొండ కల్చరల్ : చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడికి పాల్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్‌లోని గోవిందాద్రి దేవాలయం నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్యం పేరిట కోట్లాది మంది హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా ఒక మిలిటెంట్ దళాన్ని ఏర్పాటు చేసుకున్న దుండగులు.. రంగరాజన్‌పై దాడి చేస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో మాట్లాడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, లంక శివకుమార్, శంభులింగం, ప్రసాద్, మురళీకృష్ణ, లక్ష్మణస్వామి, సంతోష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలో క్రీడలకు పెద్దపీట

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్
- కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలు ప్రారంభం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో పదేళ్ల కాలంలో గత సీఎం కేసీఆర్ క్రీడలకు పెద్దపీట వేశారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ గుర్తుచేశారు. హనుమకొండలోని సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కేసీఆర్ క్రికెట్ కప్ -2025 టోర్నమెంట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, నగదు బహుమతులు, ఇళ్ల స్థలాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గం పరిధిలో ప్రతీ ఏడాది క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, కార్పొరేటర్లు చెన్నం మధు, బోయినపెల్లి రంజిత్‌రావు, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న బండా ప్రకాశ్